సంపుటి :02 సంచిక :267 పేజీలు :06
వెల ₹5

అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

బుధవారం 31, డిసెంబర్ 2025

## ఇసుక మిస్‌యూజ్‌పై కేసులు నమోదు చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

4



## సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- అగ్రంపహాడ్ లో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి సమీక్ష

5





## కోటి ఆశలతో నవ వసంతంలోకి!

- మరికొద్ది గంటల్లో 2025కు వీడ్కోలు
- 2026 న్యూ ఇయర్‌లోకి ప్రవేశం
- పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

5

కనురెప్పల వెనుక దాచుకున్న కలలు.. గుండె పొరల్లో నిక్షిప్తమైన ఆశయాలు.. గడిచిన కాలం నేర్పిన గుణపాఠాలు.. వీటన్నింటినీ మూటగట్టుకుని కాలచక్రం మరో మలుపు తిరుగుతోంది. 2025 కాలగర్భంలో కలిసిపోతుండగా.. నిశీధిని చీల్చుకుంటూ వచ్చే సరికొత్త ఉషోదయానికి స్వాగతం పలికే సమయం ఆసన్నమైంది. చేదు జ్ఞాపకాలను చెరిపేసి, వైఫల్యాల నీడలను దాటుకుంటూ, ఆశల పల్లకీలో ఆనందాల తీరానికి పయనిద్దాం. రేపటి సూర్యుడు ప్రతి ఇంటా సరికొత్త కాంతిని, ప్రతి మనసులో నూతన ఉత్తేజాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ.. ఉమ్మ డి వరంగల్ జిల్లా వాసులందరికీ 'అక్షర దర్బార్' హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు!

# మావోయిస్టుల ప్రాణదాత ఎక్కడ?

### దండకారణ్య 'మిస్టరీ డాక్టర్ రఫీక్ లాపతా!



- అడవిలో అదృశ్యమైన శస్త్రచికిత్స నిపుణుడు
- పంజాబ్‌కు చెందిన వ్యక్తి మావోయిస్టు ఉద్యమంలోకి..
- ఎంబీబీఎస్ పూర్తి చేసి నేరుగా దండకారణ్యానికి..
- ఇది భద్రతా దళాల, నిఘా వర్గాల ఎత్తుగడ ని కొందరి ఆరోపణ

2

దండకారణ్యంలో జరిగే ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులకు ప్రాణం పోసే ఆ 'మిస్టరీ డాక్టర్' ఆచూకీ ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. దశాబ్ద కాలంగా నిఘా వర్గాల కళ్లుగప్పి తిరుగుతున్న డాక్టర్ రఫీక్ అలియాస్ మణ్‌దీప్ ఎక్కడున్నారనేది అంతుచిక్కడం లేదు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఈయన ఎంబీబీఎస్ చదువు పూర్తి చేసిన తర్వాత విప్లవ భావజాలానికి ప్రభావితులయ్యారు. సమాజంలో ఉన్నత హోదాలో స్థిరపడాల్సిన వ్యక్తి దేశంలోని అణగారిన వర్గాల కోసం పోరాడాలని నిశ్చయించుకున్నారు. విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని సీపీఐ (మావోయిస్టు) పార్టీలో చేరి దండకారణ్యం బాటపట్టారు.

— అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## మళ్లీ యూరియా కష్టాలు

2

- ఎముకలు కొరికే చలిలో రైతుల నిరీక్షణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పడిగాపులు



## అదనపు కలెక్టర్‌గా రవి

- భూపాలపల్లి ఆర్డీవోగా హరికృష్ణ
- తెలంగాణలో ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ
- తక్షణం విధుల్లో చేరాలని ఉత్తర్వులు

2

# మావోయిస్టుల ప్రాణదాత ఎక్కడ?

- దండకారణ్య 'మిస్టరీ' డాక్టర్ రఫీక్ లాపతా!
- అడవిలో అదృశ్యమైన శస్త్రచికిత్స నిపుణుడు
- పంజాబ్‌కు చెందిన వ్యక్తి మావోయిస్టు ఉద్యమంలోకి..
- ఎంబీబీఎస్ పూర్తి చేసి నేరుగా దండకారణ్యానికి..
- ఇది భద్రతా దళాల, నిఘా వర్గాల ఎత్తుగడ ని కొందరి ఆరోపణ



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

దండకారణ్యంలో జరిగే ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులకు ప్రాణం పోసే ఆ 'మిస్టరీ డాక్టర్' ఆచూకీ ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. దశాబ్ద కాలంగా నిఘా వర్గాల కళ్లుగప్పి తిరుగుతున్న డాక్టర్ రఫీక్ అలియాస్ మణ్‌దీప్ ఎక్కడున్నారనేది అంతుచిక్కడం లేదు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఈయన ఎంబీబీఎస్ చదువు పూర్తి చేసిన తర్వాత విప్లవ భావజాలానికి ప్రభావితులయ్యారు. సమాజంలో ఉన్నత హోదాలో స్థిరపడాల్సిన వ్యక్తి దేశంలోని అణగారిన వర్గాల కోసం పోరాడాలని నిశ్చయించుకున్నారు. విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని సీపీఐ (మావోయిస్టు) పార్టీలో చేరి దండకారణ్యం బాటపట్టారు.

### - సమాంతర వ్యవస్థ నిర్మాణం

వైద్య వృత్తిలో అత్యున్నత శిక్షణ పొందిన రఫీక్ అడవిలో ఒక సమాంతర వైద్య వ్యవస్థను నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతం మొదలుకొని అబూజ్‌మఢ్ కీకారణ్యాల వరకు ఆయన సేవలు విస్తరించాయి. కనీస మౌలిక వసతులు లేని చోట అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించడంలో ఈయన సిద్ధహస్తులు. కాల్పుల సమయంలో గాయపడిన మావోయిస్టు అగ్ర నేతల ప్రాణాలను కాపాడిన వ్యక్తిగా ఈయనకు పార్టీలో గొప్ప పేరుంది. శరీరంలో లోతుగా దిగిపోయిన తూటాలను వెలికితీయడం వంటి క్లిష్టమైన పనులను ఆయన సునాయాసంగా పూర్తి చేస్తారు.

### - ముమ్మర గాలింపు

గత కొన్నేళ్లుగా రఫీక్ ఎక్కడున్నారనే విషయంపై స్పష్టత లేదు. భద్రతా బలగాల నిరంతర ఆపరేషన్ల కారణంగా ఆయన తన స్థావరాన్ని మార్చినట్లు తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం 2016లోనే ఆయన దండకారణ్యం వదిలి జార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లిపోయారు. ప్రస్తుతం అక్కడి అడవుల్లోనే అజ్ఞాతంగా ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈయన భార్య రింకీ కూడా మావోయిస్టు అగ్రనేతలకు వైద్యం అందించినట్లు రికార్డులు ఉన్నాయి. తాజాగా లొంగిపోయిన మావోయిస్టు నేతలు వెల్లడిస్తున్న విషయాలతో ఈ అజ్ఞాత వైద్యుడి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరమైంది. అయితే.. డాక్టర్ మిస్టరీ వెనుక మరో కోణం చెప్తున్నారు మాజీ మావోయిస్టులు, పౌర హక్కుల నేతలు. అదేంటంటే.. గతంలో ఇలాంటి అద్రుశ్యమైన నేతలంతా తర్వాత ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని, ఈసారి కూడా అలాగే జరుగుతుందోమోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిఘా వర్గాలు, భద్రతా దళాలు కావాలనే ఇలాంటి వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆరపిస్తున్నారు.

### - అతి క్లిష్టమైన ఆపరేషన్

అడవి పరిస్థితుల్లో వైద్యం అందించడం రఫీక్ ప్రత్యేకతగా చెబుతారు. ఆపరేషన్ థియేటర్ లేని చోట కేవలం టార్చ్‌లైట్ వెలుతురులో గుండెకు అతి సమీపంలో ఉన్న బుల్లెట్‌ను సైతం విజయవంతంగా తొలగించి సహచరులను ఆశ్చర్యపరిచారు. కేవలం చికిత్స చేయడమే కాకుండా దళ సభ్యులకు వైద్య మెళకువల్లో శిక్షణ ఇచ్చారు. తూటా గాయాలకు కుట్లు వేయడం, ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలపై ప్రత్యేక మాన్యువల్స్ రూపొందించారు. అడవిలో లభించే మూలికా వైద్యంపై పరిశోధనలు చేసి ఆ ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక వైద్యంతో జోడించారు. ఆదివాసీల నమ్మకాలను గౌరవిస్తూనే వారిని మూఢనమ్మకాల నుండి బయటకు తెచ్చి మందులు వాడేలా ప్రోత్సహించారు.



# న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్

అక్షర దర్బార్, చిట్యాల : 2026 నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ ప్రజలను కోరారు. మండలంలో డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, బైక్ రేసింగ్‌లకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసభ్య ప్రవర్తన చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి సురక్షితంగా నూతన సంవత్సరాన్ని జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# మళ్లీ యూరియా కష్టాలు

- ఎముకలు కొరికే చలిలో రైతుల నిరీక్షణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పడిగాపులు

అక్షరదర్బార్, మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగు వేళ రైతులకు యూరియా తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. వానాకాలం సీజన్‌లో ఎదురైన కొరతను దృష్టిలో ఉంచుకున్న అన్నదాతలు, ప్రస్తుతం యాసంగిలో చలిని సైతం లెక్కచేయకుండా తెల్లవారుజాము నుండే విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చేతిలో ఆధార్ కార్డు, పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులతో రైతు వేదికలు, సహకార సంఘాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పంపిణీ ప్రక్రియను సులభతరం చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన కొత్త ఎరువుల యాప్ మహబూబాబాద్ జిల్లాలో తొలిరోజే సాంకేతిక సమస్యలతో మొరాయించింది. దీనివల్ల అధికారులు తిరిగి పాత పద్ధతిలోనే పంపిణీ చేపట్టాల్సి రావడంతో రద్దీ మరింత పెరిగి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం మొక్కజొన్న, వరి పంటలు సాగు చేస్తున్న రైతులు, ముందు ముందు ఎరువుల కొరత తలెత్తుందనే ఆందోళనతో ముందస్తుగా నిల్వ చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న దృశ్యాలు రైతుల ఆవేదనకు అద్దం పడుతున్నాయి.

# అదనపు కలెక్టర్ గా రవి

- భూపాలపల్లి ఆర్డీవోగా హరికృష్ణ
- తెలంగాణలో ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ
- తక్షణం విధుల్లో చేరాలని ఉత్తర్వులు



అక్షరదర్బార్, హనుమకొండ : రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా కారణాలతో చేపట్టిన ఈ బదిలీల్లో భాగంగా ఆరుగురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. భూపాలపల్లి ఆర్డీవోగా పనిచేసి ఇటీవల పదోన్నతి పొందిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ నిదరు గొమ్ముల రవి హనుమకొండ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నియమితులయ్యారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పనిచేసిన వెంకట్ రెడ్డి ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత డీఆర్వో వైవీ గణేష్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా అదనపు బాధ్యతలు చేపట్టారు. భూపాలపల్లి ఆర్డీగా పోరిక హరికృష్ణ నియమితులయ్యారు. పురపాలక శాఖలో డిప్యూటేషన్ మీద ఉన్న ఎర్రోల సుదర్శన్ సేవలను రవాణా, రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ ఈ మేరకు అధికారిక జీవో విడుదల చేశారు. కీసర ఆర్డీవోగా పనిచేస్తున్న కె.వెంకట ఉపేందర్ రెడ్డిని రవాణా, రోడ్లు, భవనాల శాఖకు డిప్యూటేషన్ మీద బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్.రాజేష్ కుమార్‌ను కీసర కొత్త ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆందోల్– జోగిపేట ఆర్డీవోగా ఉన్న ఆర్. పాండును సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమ పాత బాధ్యతల నుంచి తప్పుకుని కొత్త చోట రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# ఆవిష్కరణకు ముందే శివాజీ విగ్రహం దగ్ధం

### - బంధనపల్లిలో ఘటన

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బంధనపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున తీవ్ర కలకలం రేగింది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. విగ్రహావిష్కరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ దుశ్చర్య జరగడం స్థానికంగా ఆగ్రహావేశాలకు దారితీసింది. ఉదయం గమనించిన గ్రామస్థులు వెంటనే మంటలను ఆర్పివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటన వెనుక ఆకతాయిల పని ఉందా లేక ఏదైనా కుట్ర కోణం దాగి ఉందా అనే కోణంలో విచారణ ముమ్మరం చేశారు. దోషులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# అంగన్వాడి టీచర్లకు ప్రీ స్కూల్ శిక్షణ

అక్షర దర్బార్,పరకాల: ఐసిడిఎస్ పరకాల ప్రాజెక్టు, నాగారం సెక్టార్ ఆధ్వర్యంలో రాకెట్ లెర్నింగ్ ఆర్గనైజేషన్ సహకారంతో మిషన్ బాల ఉద్యమంలో భాగంగా సెక్టార్ అంగన్వాడి టీచర్లకు ప్రీ స్కూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలియాబాద్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మాతా–శిశు సంక్షేమానికి ఐసిడిఎస్ ద్వారా అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరమని, గ్రామ ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్వాడి కేంద్రానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. నూతన సర్పంచ్‌గా విచ్చేసిన సనత్ కుమార్‌ను ఐసిడిఎస్ నాగారం సెక్టార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగారం సెక్టార్ సూపర్వైజర్ జె. రాణి, రాకెట్ లెర్నింగ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రిజ్వాన, నాగారం సెక్టార్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి నివాళులు

**-ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్**




అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన బజ్జూరి భాగ్యలక్ష్మి అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందగా, ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు.మృతురాలి కుమారుడు, రేషన్ షాప్ డీలర్ బజ్జూరి వేణుగోపాల్‌కు మనోధైర్యం కల్పిస్తూ, భాగ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ నేతలు చర్లపల్లి వెంకటేశ్వర్లు, మేకల జపాల్ తదితరులు పాల్గొన్నారు.



# హాస్టళ్లను సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలికల పాఠశాలలు, వసతి గృహాలను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సందర్శించారు. తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ఐడీఓసీలో వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలపై సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్య, మెరుగైన వసతి సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. జిల్లాలోని పాఠశాలలను ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# రాజకీయ వేదికగా చిట్యాల ఆస్పత్రి

**చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్**

అక్షర దర్బార్, చిట్యాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి రాజకీయాలకు అడ్డగా మారిందని. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ. రాజకీయ వేదికగా మార్చుతున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆరోపించాడు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ శాసనసభ్యులు వెంటనే తగిన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని  మల్లేష్ డిమాండ్ చేశారు.



# గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యం

- రేకంపల్లి గ్రామ సర్పంచ్ కొలుగురి సుజాత
- గ్రామంలో శ్రమదానం

అక్షర దర్బార్, దుగ్గొండి: గ్రామాభివృద్దే తన ప్రధాన లక్ష్యమని రేకంపల్లి గ్రామ సర్పంచ్ కొలుగూరి సుజాత అన్నారు. బుధవారం రేకంపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, జీపీ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీనగర్–రేకంపల్లి ప్రధాన రహదారిపై పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డు వెడల్పు చేశారు. గ్రామాభివృద్ధిలో గ్రామస్తులు భాగస్వాములై సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విజన్ ఆంధ్రా క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ 2026 నూతన సంవత్సరానికి సంబంధించిన విజన్ ఆంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎలగందుల మోహన్‌తో పాటు రైస్ మిల్లర్స్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ, విజన్ ఆంధ్ర పత్రిక ప్రజలకు–ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ వినూత్న వార్తలతో ప్రజల ఆదరణ పొందుతోందని అన్నారు. రంగురంగులుగా, సులభంగా అర్థమయ్యే విధంగా క్యాలెండర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు.



# దామెర పోలీస్ స్టేషన్ తనిఖీ

అక్షర దర్బార్, పరకాల: దామెర పోలీస్ స్టేషన్‌ను పరకాల ఏసీపీ సతీష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్ ఆయనకు స్వాగతం పలికారు. స్టేషన్‌లోని రికార్డులు, బ్యారక్, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఫిర్యాదులపై సత్వర స్పందన, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి పటిష్టమైన పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.




# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- పరకాల బస్టాండ్ లో విషాదం
- ముందే హెచ్చరించిన 'అక్షర దర్బార్'
- పట్టించుకోని ఆర్టీసీ ఉన్నతాధికారులు

అక్షర దర్బార్,పరకాల: పరకాల ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశ ద్వారం వద్ద ప్రమాదాలకు కారణమవుతున్న మూలమలుపుపై ముందుగానే హెచ్చరించినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన బుధవారం చోటుచేసుకుంది. బస్టాండ్ లోపలికి వెళ్లే దారిలో నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ములుగు జిల్లా (మండలం) పల్సబ్ పల్లి గ్రామానికి చెందిన తోట రాధమ్మ(70)గా గుర్తించారు.అక్షర దర్బార్ పత్రిక ఏప్రిల్ నెలలోనే బస్టాండ్ ప్రవేశ ద్వారంలో ఉన్న పార్లర్ ఏర్పాటు ప్రమాదకరమని వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి టర్నింగ్ వద్ద పార్లర్ నిర్మాణాన్ని కొనసాగించడంతో ప్రమాదం తప్పలేదు. బుధవారం బస్టాండ్‌లోకి ప్రవేశిస్తున్న ఓ వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనను చూసిన ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతికి కారణమైన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.




ప్రణాళిక లేకుండా నిర్మిస్తున్న
మిల్క్ పార్లర్..
ఆర్టీసీ బస్సుకు వినతి పత్రం ఇచ్చిన సీనియర్ సిటిజన్
అక్షర దర్బార్, పరకాల : అక్షర దర్బార్ పత్రికలో ప్రచురితమైన ఆదాయం కోసం ప్రాణాలతో చెలగాటం అనే వార్త కథనానికి పరకాల పట్టణంలోని ప్రజలు స్పందిస్తూ పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ ను ప్రశ్నిస్తున్నారు. అయినా పరకాల డిపో మేనేజర్ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయనపై పై అధికారులకు ఫిర్యాదులు చేస్తామని పలువురు అక్షర దర్బార్ పత్రిక విలేకరికి తెలిపారు. బుధవారం పరకాల పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్ మార్త బిక్షపతి పరకాల పట్టణ ఆర్టీసీ డిపో మేనేజర్ కు మిల్క్ పార్లర్ ను బస్టాండ్ లోపల ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే ఆర్టీసీ డిపో మేనేజర్ తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. డిపో మేనేజర్ తీసుకోకపోవడంతో ఆ సీనియర్ సిటిజన్ నిరసనగా వినతి పత్రాన్ని పరకాల ఆర్టీసీ బస్టాండ్ లో బస్సుకు ఇవ్వడం జరిగింది.
02
ఆదాయం కోసం

## ఆర్టీసీ అధికారులే బాధ్యులు

**మార్త భిక్షపతి**



ఈ ప్రమాదంపై పరకాల సీనియర్ సిటిజన్ మార్త బిక్షపతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణలో నిర్మాణం జరుగుతున్న దశలోనే పలుమార్లు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను నిర్మాణం నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు. అయినా లెక్కచేయకుండా నిర్మాణం కొనసాగించడం వల్లే ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిపో మేనేజర్‌పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



# కోతుల బెడద నివారణకు కొండెంగ

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ దండం సంపత్, ఉపసర్పంచ్ సుర బోయిన రాంబాబు కోతుల నివారణకు కొండెంగను ఏర్పాటు చేశారు. కోతుల వల్ల కలిగే సమస్యలు తగ్గేలా చర్యలు చేపట్టిన గ్రామ పాలకవర్గంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మద్ది మేడారాన్ని సందర్శించిన అధికారులు

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి గ్రామంలోని మద్ది మేడారాన్ని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, డీఈ అర్జీ నాయక్, ఏడీఈ జానకిరామ్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాగరాజుపల్లి సర్పంచ్ బచ్చు తండా సర్పంచ్ రవి, ఆలయ మాజీ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, గుల్లపాడు మాజీ సర్పంచ్ కట్టయ్య, మామిండ్ల మోహన్ రెడ్డి, ఆలయ పూజారి నాగరాజు పాల్గొన్నారు.



# డాక్టర్ సిరంగి పరామర్శ

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన పంచగిరి లక్ష్మీ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరకాల పట్టణ ప్రముఖ వైద్యులు,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారితో పాటు బిజెపి పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, మున్నూరు కాపు నాయకులు బసాని సోమరాజు, పంచగిరి శ్రీనివాస్, కోడెల లింగమూర్తి, మెంతుల సురేష్ పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్
- 69వ జాతీయ పాఠశాల క్రీడల్లో గీతాంజలి విద్యార్థి సుకృతకు కాంస్య పతకం

అక్షరదర్బార్, మహబూబాబాద్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్ర రాష్ట్రం సాంభాజీనగర్‌లో నిర్వహించిన 69వ జాతీయ పాఠశాల క్రీడలు–ఫెన్సింగ్ (అండర్–14 బాలికలు) పోటీల్లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహబూబాబాద్ గీతాంజలి స్కూల్ విద్యార్థిని దసరాపు సుకృతను బుధవారం ఆయన అభినందించి సత్కరించారు. దసరాపు సుకృత సాధించిన ఈ విజయం మహబూబాబాద్ జిల్లాలోని విద్యార్థులు, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఎస్పీ ఆశీస్సులు అందజేశారు. అనంతరం గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ కోనకంచి రామకృష్ణ సుకృతను అభినందించారు.





# నిధులు బారెడు.. అభివృద్ధి జానెడు!

- పరకాల నిధులను దుబారా చేస్తున్న పాలకులు
- పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- డా. కాళీ ప్రసాద్, డా. సిరంగి సంతోష్ కుమార్




అక్షర దర్బార్,పరకాల: పరకాలకు వచ్చే నిధులను దుబారాగా వాడుకుంటూ పట్టణ అభివృద్ధిని శూన్యంగా మార్చుతున్నారని పరకాల బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ విమర్శించారు. బుధవారం పరకాల బీజేపీ పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన రోడ్డు క్లీనింగ్ మిషన్ వాహనాన్ని పక్కకు పెట్టడం విడ్డూరమని, బస్టాండ్ కూడలి ప్రమాదాలకు కేంద్రంగా మారిందని అన్నారు. వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. పరకాల అభివృద్ధి జరగాలని నిజంగా కోరుకునేది బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. పట్టణంలో వ్యాపారాలు కుదేలై వ్యాపారస్తులు పరకాలను వదిలి వెళ్తున్నారని, పరకాల అభివృద్ధి కోసం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలుగా పరకాలలో తట్టెడు మట్టికూడా పోయలేదని, కోట్ల నిధులు వస్తున్నా అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందిగామలో పౌరహక్కుల దినోత్సవం



అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం నందిగామ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ వేడుకలు తహసీల్దార్ ఎం. కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలోని సమస్యలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్, ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# వందేళ్ల ఓంకార్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మాణం

**ఎం సీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**

సంగెం, అక్షర దర్బార్ : దేశంలో మార్క్సిజంతో పాటు అంబేద్కర్ ఆలోచన విధానం అమలులోకి వస్తేనే అసమానతలు లేని వ్యవస్థ సాధ్యమని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. సంగెం మండలం కుంటపెల్లిలో జరిగిన ఎంసిపిఐ(యు) వరంగల్ డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం ఖాయమని, రానున్న కాలం సోషలిస్టు ఆర్థిక వ్యవస్థదేనని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి వందేళ్లు, వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ వందేళ్ల సందర్భంగా ప్రజా ఉద్యమాలు, ప్రజా సంఘాల నిర్మాణానికి పూనుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు కీలకమని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ మంద రవి గారు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ కన్కం సంధ్య, జిల్లా కమిటీ సభ్యులు బత్తిని కుమారస్వామి, డివిజన్ నాయకులు గోనె రాంచందర్, సోమిడి రవి, చెవ్వ కుమారస్వామి,గూడ సురేష్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్తి చేసిన పనులే అభివృద్ధికి నిదర్శనం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




అక్షర దర్బార్, భూపాలపల్లి : పూర్తి చేసిన పనులు కనిపిస్తేనే అభివృద్ధి తెలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని పెండింగ్, పూర్తయిన పనులపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్లపై 60సీ కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సీసీ రోడ్లు, డ్రైనేజీ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్దేశించి సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- అగ్రంపహాడ్ లో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి సమీక్ష




అక్షరదర్బార్, హనుమకొండ: అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతరకు అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లను పూర్తి చేసి విజయవంతంగా నిర్వహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని శ్రీ సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి జాతర ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం సమీక్షా సమావేశంలో వారు పాల్గొనగా దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, సాగునీటిపారుదల, ఎక్సైజ్, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన జాతర ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేసి ప్రశాంతంగా సాగే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు కాబట్టి వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తకుండా తగిన స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు చుట్టుపక్కల రైతులతో మాట్లాడి పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, సంబంధిత రైతులకు ఐదు వేల పరిహారం అందజేయాలన్నారు. జాతరకు వచ్చే రహదారులలో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయని వాటి వద్ద తగిన జాగ్రత్త చర్యలు అధికారులు చేపట్టాలన్నారు. భక్తులు స్నానాలు చేసే ఎస్సారెస్పీ కెనాల్ లో తగిన నీరు ఉండేవిధంగా, అదేవిధంగా అగ్రంపహాడ్ చెరువు వద్ద కూడా సాగునీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమావేశం అనంతరం జాతర ఏర్పాట్లపై సమీక్ష చేసుకుని స్థల పరిశీలన చేసి తగిన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సౌకర్యం మెరుగ్గా ఉండాలని, అదనంగా నీటి వసతులు కల్పించాలని మిషన్ భగీరథ శాఖ అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, ఎక్కడ కూడా విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల వెంట తప్పనిసరిగా విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. అదనంగా పోల్స్ ఏర్పాటు చేసి లైట్స్ పెట్టాలన్నారు. రోడ్లు బాగుండాలని, రోడ్లకు ఇరువైపులా జంగల్ క్లియరెన్స్ చేయించాలన్నారు. జాతరలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాహనం అందుబాటులో ఉండాలన్నారు. జాతరలో గుడుంబా నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పటిష్ట క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వచ్చేనెల 20వ తేదీన మరోసారి జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోనే అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతర.. పెద్ద జాతర అని, ఈ జాతరకు సుమారుగా పది నుండి 12 లక్షలు మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని అన్నారు. ఇక్కడ దర్శనం చేసుకున్న అనంతరం మేడారానికి భక్తులు తరలి వెళ్తుంటారని పేర్కొన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు దర్శనం కోసం వస్తుంటారు కాబట్టి జాతరకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణ పై మరోసారి సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలయ ఈవో నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జాతర నిర్వహణకు దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు పూర్తి చేస్తామని అన్నారు. గతంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఈ జాతరకు వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల ఏసీపీ సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, ఆర్టీసీ డిఎం దరంసింగ్, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు అగ్రంపహాడ్, అక్కంపేట, చౌళ్లపల్లి సర్పంచులు మహేందర్, సాంబయ్య, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# నవ వసంతంలోకి!

- మరికొద్ది గంటల్లో 2025కు వీడ్కోలు
- 2026 న్యూ ఇయర్ లోకి ప్రవేశం
- పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు




అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : కాలచక్రం మరో మలుపు తిరుగుతోంది. 2025 సంవత్సరపు ఆఖరి సూర్యుడు సెలవు తీసుకున్నాడు. నేటి అర్ధరాత్రి 12 గంటల గడియారం ముల్లు కదిలితే చాలు సరికొత్త చరిత్రకు నాంది పడుతుంది. గడిచిన ఏడాది కాలంలో మిగిలిన చేదు జ్ఞాపకాలను వదిలేసి, సరికొత్త ఆశలతో ముందుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. వైఫల్యాల నీడలను చెరిపేస్తూ ఆశల పల్లకీలో కొత్త ఏడాదిలోకి అడుగు పెడదాం. కాలం ఎప్పుడూ ఆగదు. అది నిరంతరం ప్రవహించే జీవనది లాంటిది. పాత ఏడాది నేర్పిన పాఠాలను గుండెల్లో భద్రపరుచుకుందాం. రేపటి ఉదయం విరిసే సూర్యకాంతి సరికొత్త ఉత్సాహాన్ని మోసుకొస్తుంది. ప్రతి ఇంటా ఆనందాల సిరులు కురిపించాలని కోరుకుందాం. గడిచిన కాలం మనకు ఎన్నో సవాళ్లను విసిరి ఉండవచ్చు. వాటన్నింటినీ అధిగమించి ధైర్యంగా ముందుకు సాగడమే జీవన పరమార్థం. విద్వేషాలను వీడి ప్రేమాభిమానాలతో లోకాన్ని నింపుదాం. ప్రతి హృదయం ఒక కొత్త ఆశతో చిగురించాలి. రేపటి ఆశయం కోసం నేడు పాత అనుభవాలను వీడ్కోలు పలుకుదాం. చీకటిని చీల్చుకుంటూ వచ్చే ఉషోదయం మీ జీవితాల్లో వెలుగులు నింపాలి. కష్టాల కడలిని దాటి సుఖాల తీరానికి చేరుకోవాలని ఆకాంక్షిద్దాం. ఈ కొత్త వసంతం అందరికీ ఐశ్వర్యాలను ప్రసాదించాలి. నూతన ఉత్తేజంతో అభివృద్ధి పథంలో పయనిద్దాం. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలని కోరుకుందాం. ఉమ్మడి వరంగల్ జిల్లావాసులందరికీ విష్ యూ ఏ హ్యాపీ న్యూ ఇయర్.

# కుటుంబ సభ్యులతో గడపండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఇన్ స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు జె విల్సన్, పి ప్రకాష్ రెడ్డి, ఆర్ఎస్ఐ కె ప్రభాకర్, ఏఆర్ఎస్ఐలు అబ్దుల్ రఫీక్, యం రవి ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు సేవలందించిన పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని, పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బు ను భవిష్యత్తు అవసరాలకు భద్రపర్చుకోవాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ కుమార్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వేగవంతంగా సాగాలి

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షరదర్బార్, హనుమకొండ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమం వేగవంతంగా సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– ఎస్ఐఆర్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాల వారిగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం గురించి తహసిల్దార్లు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 2002 ఓటర్ల జాబితా 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలలో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమంను ఆర్వోలు, బీఎల్వోలతో వేగవంతంగా చేయించాలని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో అన్ మ్యాప్ జాబితా పై ఆర్వోలతో మొదలుపెట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా ఎస్ఐఆర్ చేపట్టాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను బిఎల్ఓ లతో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ వై.వి.గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్లు విజయలక్ష్మి, జగన్మోహన్ రెడ్డి, జ్యోతివరలక్ష్మి దేవి, రాణి, రవీందర్ రెడ్డి, భావ్ సింగ్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక మిస్ యూజ్ పై కేసులు నమోదు చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరదర్బార్, భూపాలపల్లి: ఇసుకను దుర్వినియోగం చేసినట్లయితే సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుస్పష్టం చేశారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎంపిడిఓలతో ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక రవాణా అంశంపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూపన్లలో అక్రమ సవరణలు చేసినా, అక్రమ రవాణా జరిగినా ఎంపీడీఓలు కఠినంగా వ్యవహరించాల్సిందేనని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఇసుక సరఫరా జరగాలని సూచించారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915